

షేక్స్‌పియర్ నాటకంలో జాగ్రఫీ, హిస్టరీ, సందర్భాలు వస్తే అవన్నీ ఆసక్తికరంగా చెప్పేవారు. రోసయ్యగారి పాఠం వలన ఎన్నో విషయాలు తెలియడమేగాక, జనరల్ నాలెడ్జి పెరిగేది

### మానవవాదులను తర్ఫీదు చేసిన

# ఎలవర్తి రోసయ్య

డాక్టర్ నరిసెట్టి ఇన్నయ్య

పురుషులందు పుణ్య పురుషులున్నారో లేదోగాని, ఉపాధ్యాయులలో ఎలవర్తి రోసయ్య వంటివారు వేళ్లపై లెక్కబెట్టవచ్చు. ఆయన వసుధా ఇంగ్లీషు లెక్చరర్. కాని తెలుగులో నిష్ణాతుడు. వీర గ్రాంధికవాది కూడా. జీవితాంతం అలాగే నిలిచారు.

రోసయ్యగారు విద్యార్థిగా వున్న రోజులలో పిలకవుండేది. కవిత్వం అంటే ఆయనకు అమిత ప్రీతి. నన్నయ, తిక్కన, ఎర్రన కవిత్రయాన్ని సైతం నన్నయగారు, తిక్కనగారు, ఎర్రనగారు అని సంబోధించే రోసయ్యగారి పిలక ఒకనాడు తెల్లవారు జామున కీ.శే. ఆవుల గోపాలకృష్ణమూర్తి కోసేశారు. రోసయ్య కవితా బలహీనత తెలిసిన ఎ.జి.కె. (ఆవుల గోపాల కృష్ణమూర్తిని అలా పిలిచేవారు సన్నిహితులంతా) పిలక కత్తిరించినందుకు పరిష్కార మార్గంగా మంచి కవితలు వినిపించాడు. అది రాసిందెవరు అని గుచ్చిగుచ్చి రోసయ్య అడగడం, కవిపేరు చెప్పకుండా మరోపద్యం చదవడం, అలా రోసయ్యలో ఆసక్తి పెంచుతూ ఆవుల గోపాలకృష్ణమూర్తి సస్పెన్స్ అట్టి పెట్టారు. చివరకు ఆ కవితలు రాసింది కీ.శే. త్రిపురనేని రామస్వామి అని బయటపెట్టారు. రోసయ్య ఆశ్చర్యంతో ఆ తరువాత రామస్వామి రచనలన్నీ చదివి ఆనందించారు.

ఆవుల గోపాల కృష్ణమూర్తికి శామ్యూల్ జాన్సన్ అంటే ఇష్టంకాగా, రోసయ్యకు మాథ్యూఆర్నాల్డ్ అంటే ప్రీతి. ఇరవురూ ఆ విషయంపై వాదించుకోవడం ఆహ్లాదకరంగావుండేది.

1953నుండీ నేను రోసయ్యగారి విద్యార్థిగా ఆంధ్ర క్రైస్తవ కళాశాల, గుంటూరులో నాలుగేళ్లపాటు చదివాను. ఆ నాలుగేళ్లలో రోసయ్యగారు ప్రోజ్, పొయిట్రీ, డ్రామాలు ఇంగ్లీషులో చెప్పారు. పోర్షన్ పూర్తి కావడం లేదని,పరీక్షలు దగ్గర బడేకొద్దీ విద్యార్థులు గోల పెట్టేవారు. షేక్స్పియర్ డ్రామాలు సగం మాత్రమే అయ్యేవి.మిల్టన్ కావ్యాలూ అంతే. ఆయిన వరకూ క్షుణ్ణంగా వుండేది. ఆమేరకు శ్రద్ధ వహిస్తే పరీక్షలు పాసయ్యేవారు. కాని విద్యార్థులు చాలామంది పరీక్షాగత ప్రాణులు గనుక రోసయ్యగారిపై గొణుక్కునేవారు. మిగిలిన టీచర్లు పోర్షన్ పూర్తిచేసి, రివైజ్ చేస్తూండగా రోసయ్యగారి పాఠాలు సగంలోనే ఎందుకు మందకొడిగా నిలిచేవి?

పాఠాలలో ప్రస్తావనకు వచ్చే రిఫరెన్సులు, క్రాస్ రిఫరెన్సులు, అనేక సబ్జెక్ట్‌లపై ఆద్యంతాలు రోసయ్యగారు చెప్పేవారు. షేక్స్పియర్ నాటకంలో జాగ్రఫీ, హిస్టరీ, సందర్భాలు వస్తే అవన్నీ ఆసక్తికరంగా చెప్పేవారు. శ్రద్ధగా పట్టించుకున్న వారికి రోసయ్యగారి పాఠం వలన ఎన్నో విషయాలు తెలియడమేగాక, జనరల్ నాలెడ్జి పెరిగేది. ఆశ్చర్యకరంగా రోసయ్యగారు గణితం, సైన్స్ ప్రస్తావనలు వచ్చినా వాటిలోతు పాతులలోకి పోయి మెలకువలు విడమరచేవారు. నాటకాలను పాత్రోచితంగా చదివేవారు. హేమ్లెట్‌లో ఘోస్ట్ పాత్ర మాటల్ని వినిపించడానికి వాయిస్ మార్చేవారు. స్టేజి గురించి నిర్దుష్టంగా ఆయనకు తెలుసు. మిల్టన్ కవిత్వాన్ని సబ్లైం అంటూ తన్మయత్వంతో చెప్పేవారు. మధ్యలో తెలుగు సాహిత్య ప్రస్తావనలు తెచ్చి, పోల్చి చెప్పేవారు. ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య ప్రస్తావనలు విపరీతంగా తెచ్చేవారు.

రోసయ్యగారు అధ్యాపకుడుగా క్రమశిక్షణావాది. చక్కగా ముచ్చటగా కోటు పాంటు ధరించి సైకిల్‌పై ఏ.సి.కాలేజికి వచ్చేవారు. విద్యార్థులకు ఆయనంటే భయం వుండేది.

రోసయ్యగారు ఎందరో శిష్యులను తయారు చేశారు. ఒకసారి ఆయన పాఠాలు విన్నవారు జీవితంలో మరచిపోరు. అది ఆయన ప్రత్యేకత. క్లాసులో పాఠాల మాట అలావుంచి, కొందరు ఇంటికి వెళ్ళి ఆయన వద్ద నేర్చుకునేవారు. అలాంటి వారిలో నేనొకడిని.

రోసయ్యగారు తన ఇంటివద్ద అనేక విషయాలు చెప్పి,తనతోబాటు భోజనం చేయించి, పంపేవారు. ఎం.ఎన్. రాయ్ సిద్ధాంతాలు, హ్యూమనిజం, రేషనలిజం, నాస్తికత్వం, అవన్నీ నేను రోసయ్యగారి నుండే నేర్చాను. ప్రతి విషయానికీ రిఫరెన్స్ చూపడం ఆయన ప్రత్యేకత. రాయ్ సిద్ధాంతాలలో జటిల విషయాలను అర్థమయ్యేట్లు చెప్పడం రోసయ్యగారికి చాలా సులభంగా వుండేది. రాయ్ అనుచరులలో జె.డి.పరేఖ్, ఎ.ఎం.తార్కుండే, కె.కె.సిన్హ, ఫిలిప్‌స్ప్రాట్ వంటి వారిని గురించి కూడా చెప్పేవారు. ఇంగర్‌సాల్, థామస్ పెయిన్ వంటివారి రచనలు ప్రస్తావించి చూపేవారు. రోసయ్యగారు హ్యూమనిజాన్ని ఆసక్తితో చెప్పారు.

సాహిత్య రంగంలో రోసయ్యగారు గ్రాంధికవాది. దీనిపై తాను రాసిన చిన్న గ్రంథం చూపారు. కాని ప్రచురించలేదు. అందులో అన్నీ కొటేషన్లు వుండేవి. ప్రాచ్యపాశ్చాత్య సాహితీ పరుల్ని ఉదహరిస్తూ గ్రాంధిక వాదానికి అనుకూలంగా గంటల తరబడి చెప్పేవారు. వాడుక భాషా వాదుల్ని గిడుగు రామమూర్తి మొదలు వడ్లమూడి గోపాల కృష్ణయ్య వరకూ ఖండించేవారు. పానుగంటి లక్ష్మీ నరసింహారావు ''విమర్శా దర్శ విమర్శాదర్శ'' అనే రచన చదివి అందలి ప్రత్యక్షరాన్ని ఆనందించేవారు.

కవులలో కొందరి పట్ల విపరీతాభిమానంగల రోసయ్యగారు తనకుమారులకు ఆ కవుల పేర్లు పెట్టుకున్నారు. రామరాజభూషణుడు, చిన్నయసూరి అలా వచ్చినవే.

తెలుగు వ్యాకరణంలో రోసయ్యగారి విషయ పరిజ్ఞానం మెచ్చుకున్న కీ.శే. దువ్వూరి వేంకట రమణ శాస్త్రిగారు తన ''రమణీయం''లో ఆయన ప్రస్తావన తెచ్చారు. కీ.శే. త్రిపురాన వేంకట సూర్యప్రసాదరాయ వర్మ తన ''మొయిలు రాయబారం''లో రోసయ్యను ప్రస్తుతించారు.

రోసయ్యగారి ప్రేరణతో పి.హెచ్.గుప్త ఇంగ్లీషులో రామాయణంపై నిశిత పరిశీలన ప్రచురించారు. ఆ రచనకు రోసయ్యగారు ప్రూఫ్‌లు దిద్దారు. పి.హెచ్. గుప్త విశాఖ పట్టణంలో ఎం.ఎన్.రాయ్‌కు ఆతిథ్యం యిస్తుండేవారు. 1938 నుండీ రాయ్ ఎప్పుడువచ్చినా గుప్త యింట్లోనే బస చేసేవారు. ఎం.ఎన్.రాయ్‌కు చెందిన ఎన్నో విశేషాలు రోసయ్యగారు ఆసక్తిగా చెబుతుండేవారు.

కవితారంగంలో రాగద్వేషాలు బాగా వున్న రోసయ్యగారు తన అభిప్రాయాలు బాహాటంగా బయటపెట్టేవారు. ఆవుల గోపాల కృష్ణమూర్తి ప్రసంగాలు బాగా మెచ్చుకునేవారు. సాహిత్యంలో ఔచిత్యం అనే శీర్షికపై ఎ.జి.కె. ఏ.సి.కాలేజీలో ప్రసంగిస్తే రోసయ్యగారి ఆనందం యింతా అంతాకాదు. ఆ ప్రసంగాన్ని స్ఫూర్తి శ్రీ రాయగా, నేను ఆంధ్రపత్రికకు పంపాను. దానిపై వాదోపవాదాలు సాగాయి.

జనానికి అర్థం అయ్యేట్లు రాయమని జి.వి.కృష్ణారావుతో అన్నట్లు రోసయ్యగారు చెప్పేవారు.

సంగీతంలో రోసయ్యగారికి ప్రవేశం, అభిమానంవుంది. ద్వారం వెంకటస్వామి నాయుడు వయోలిన్ పలికిస్తాడనీ, చౌడయ్య వాయిస్తే పేడుమీద పేడు రుద్దినట్లుంటుందనేవారు.

ఉపాధ్యాయుడుగా వున్న రోసయ్యగారు తరువాత జె.కె.సి. కళాశాల,గుంటూరు ప్రిన్సిపాల్‌గా వెళ్ళారు. ఆయన పరిపాలనపై అనుభవంగల వారు తెలపాల్సిందే.

రోసయ్యగారికి కమ్మ కులాభిమానం వుండేది. మోతాదు మించి వుండేదని కొందరనేవారు. కమ్మవారి గోత్రాలు, పుట్టుపూర్వోత్తరాలు, వంశవృక్షాలు, అలాంటివన్నీ పట్టించుకునేవారు. ఆయన ప్రిన్సిపాల్ పాలనలో అదెంతమేరకు పనిచేసిందో తెలియదు.

కొద్దిరోజులు భీమవరం, పశ్చిమగోదావరిలో కూడా రోసయ్య గారు పనిచేశారు. జీవితం చివరి దశలో ఒక ప్రాథమిక పాఠశాల నడిపారు.

ఒకే ఒకసారి అమెరికా వెళ్ళి వచ్చారు. రోసయ్యగారితో వివిధ వ్యక్తుల అనుభూతులు, జ్ఞాపకాలు ఆసక్తికరంగా వుండగలవు.